## కథ

**“భగవతీ మాయీ! ఉగాది వస్తున్నాది. ఎప్పటినుండో అడుగుతున్నావు కదా! నీకు నచ్చిన మెజెంటా అంచున్న పసుపుపచ్చ మీద ఆకుపచ్చ పువ్వులున్న మైసూరు సిల్కు చీర కొనుక్కోకూడదూ? ఇవాళ నాకేం పని లేదు. వెళదామంటే మార్కెట్‌కి వెళ్దాం” అన్నారు మా ఆయన సాయంత్రం ఆఫీసునుండి వస్తూనే.**

# నాకు నచ్చిన చీర కొనుక్కోగలనా?!

‘‘ఆ! అదొక్కటే తక్కువ. బీరువాలో ఇరవై కొత్తచీరలు మూలుగుతున్నాయి. నా బొంద. ఇంకేం కొనుక్కుంటాను? ఎవరి ఖర్మకి యెవరు కర్తలు? నేను ఈ జన్మలో ఆ చీర కొనుక్కోలేను. ఎవర్ని యేమి ప్రయోజనం? నా ఖర్మంతే. పెళ్ళయిన నాటి నుండీ అనుకొంటున్నాను. అటువంటి చీర కొనుక్కోవాలని. ఖర్మ..ఖర్మ..అయినా ఆ పిలుపేంటి? భగవతీ మాయిట..భగవతీ మాయీ! చక్కగా మా వాళ్ళు పెట్టిన పేరు భగవతీ అని పిలవలేరూ?’’ విసుక్కున్నాను.

‘‘సరసం లేవోయ్!’’ అంటూ నవ్వేశారాయన.

నా నలభైయ్యేయిదేళ్ళ జీవితంలోనూ నేనూ, ఆయనా చక్కగా బజారుకెళ్ళి వో మూడు గంటలేనా తిరిగి యెంపిక చేసి, నాకు నేనుగా కొనుక్కున్న చీరలు వేళ్ళమీద లెఖ్ఖపెట్టవచ్చు. ముఖ్యంగా అదుగో...ఆయన వర్ణించిన చీర నాకెంత యిష్టమో! అది యెప్పుడూ అందని ద్రాక్షపండే అవుతున్నాది. యెవరికి చెప్పుకోను? ఎవరికి చెప్తే యెవరు యేం చేయగలరు?

‘‘పోనీ వుంటే వున్నాయిలే. నీకిష్టం కదా కొనుక్కోకూడదా?’’ అన్నారు ఆయన.

‘‘సర్లెండి. మీరెప్పుడు పాడే పాటే కదా! బీరువా నిండా కొత్త చీరలుండి, అవి కట్టుకోడానికి అవకాశం లేకపోతే నాకు మటుకు నిద్ర పట్టడం లేదు. మీకేం పోయింది? ఎన్నయినా చెప్తారు. అనుభవిస్తే తెలుస్తుంది. ఒకటో, రెండో కాదు. ఇరవై చీరలున్నాయి! ఎప్పుడు కట్టుకుంటానో, యెప్పుడు ఆ మెజెంటా అంచు చీర కొనుక్కుంటానో...’’ అంటూ వాపోయాను.

చిన్నప్పుడు యెవరింటికైనా చుట్టం చూపుగా వెళ్తే, తిరిగి వచ్చేసేటప్పుడు అణావో, బేడో యిచ్చి ‘పిప్పరమెంటులు కొనుక్కోవే’ అనేవారు. కొంచెం వయస్సు వచ్చేక వో అర్ధరూపాయో, మహా అయితే వో జాకెట్టు గుడ్డముక్కో యిచ్చేవారు. పుట్టినరోజులకీ వాటికీ కూడా వో రూపాయి చేతిలో పెడితే ఘనంగా యిచ్చినట్టే! నా పద్దెనిమిదో యేట నాకు పెళ్ళయింది. పెళ్ళయి కాపురానికి వచ్చిన వెంటనే శ్రీవారు వొక చీర కొని తెచ్చేరు. ఆయన స్నేహితుడెవరో జైపూర్ నుండి చీరలు తెచ్చేరట. నాలుగు వందల రూపాయల జీతం తెచ్చుకునే ఆయన నూట యాభై రూపాయలు పెట్టి చీర తెచ్చేరు! స్టీల్ గ్రే రంగు, జరీ అంచు చీర. నాకేమీ నచ్చలేదు. అయితే పెళ్ళయిన కొత్త. ఏమంటే యేమను కొంటారో! అదీకాక ఆయన అంత అభిమానంగా నాకోసం చీర తెస్తే అది నచ్చలేదంటే యేం బాగుంటుంది?


ముఖం మీద పెట్టుడు నవ్వుతో ‘‘నాకోసం యెంత మంచి చీర తెచ్చేరండీ! చీర రంగు, అంచు అద్భుతంగా మేచ్ అయ్యేయండీ! అయినా మీకింత బాగా చీరల సెలక్షన్ యెలా వచ్చండీ?’’ అని గోముగా అనేశాను. నా మొహం చీర రంగు, అంచుకి జరీ అసలు మేచ్ అవలేదు. కాని మా అమ్మ నాకు నేర్పిన సంసార సూత్రాలలో మొదటి ఆయన యేవేనా బట్టలు కొని తేస్తే అవి నచ్చలేదని యెప్పుడూ చెప్పకూడదని. అవి నచ్చకపోతే నెమ్మదిగా సమయం చూసుకొని, యే రాత్రివేళో పడగ్గదిలో చెప్పాలట. అది కూడా ఆ బట్టలు కొన్న నాలుగైదు రోజుల తరువాత మాత్రమే చెప్పాలట! మరేం చేస్తాను? పతిదేవుడు కొనితెచ్చిన చచ్చుచీర యీ మధ్య దాకా కట్టుకొంటూనే వున్నాను.

నెమ్మదిగా సంసారం యీదటం ప్రారంభించాక ఆయనతో షాపింగ్‌కి వెళ్ళడం, అదీ ఆయనతో అయితేనే నాకెంత ఆనందమో చెప్పాను. ఆ తర్వాత మరెప్పుడూ నాకోసం తను బట్టలు కొని తెచ్చెయ్యలేదు. ఎప్పుడూ యిద్దరం కలిసే వెళ్ళే వాళ్ళం. నిజం చెప్పాలంటే ఆయనతో కంటే, మా పక్కింటి సుందరి వదిన గారితో షాపింగ్ నాకు చాలా బాగుంటుంది. రెండు సార్లు కాబోలు నేనూ, ఆవిడా కలిసి షాపింగ్‌కి వెళ్ళేం. స్పెషాలిటీ యేమిటంటే, ఆవిడతో షాపింగ్‌కెళ్తే అసలు టైము తెలియదు. వెళ్ళేది యెప్పుడో మనం నిర్ణయించుకొంటే చాలు. వచ్చేది పరిస్థితులు నిర్ణయిస్తాయి. ఎక్కడా కూడా ‘‘అయ్యో, యింకొన్ని చూస్తే సెలక్షన్ యింకా బాగుండేదేమో’’ అని అనిపించదు. మనస్సు పూర్తిగా నిండే దాకా యే షాపులోంచి బయటికి వచ్చే సమస్యే లేదు, సుందరి వదిన గారితో షాపింగుకి వెళ్తే. అయినా సుందరి వదినతో వెళ్తే మా ఆయనతో వెళ్ళిన సరదా వుండదు కదా! మా ఆయనతో వెళ్తే, వెళ్ళే ముందు యెన్ని ప్రమాణాలు చేసినా, షాపులోకెళ్ళిన ఐదు నిమిషాలలో కొనేసుకోమంటారు. యెలా చావను? ఐదు నిమిషాలలో చీర తాలూకు యే వివరమూ నాకు చూడడం ప్రారంభం కూడా అవదు! యేమేనా అంటే అనవసరమైన కస్సు, బుస్సులు! అలాగే జరిగిపోతున్నాయి రోజులు. ఈ జన్మకింతే అవి సరిపెట్టేసుకొన్నాను.

ఆయన మిగతా అన్ని విషయాలలోనూ నిజంగా దేవుడే! ఒక్క చెడ్డ అలవాటూ లేదు! ఈ వొక్క షాపింగ్ విషయం పట్టుకొని ఆయనతో యేం గొడవ పెట్టుకోను? ఆఖరికి షాపింగ్ అంటేనే వో రకమైన విముఖత లాంటిది ఏర్పడిపోయింది! ఆయన యెప్పుడైనా షాపింగ్ విషయం యెత్తుతే, వీలయినంత వరకు దాటవేసేయడం అలవాటయిపోయింది. పాపం మానవుడు...షాపింగ్ సరదా లేని భార్య దొరికిందవి సంబరంగా వొకటి, రెండుసార్లు తన స్నేహితులతో చెప్పడం నాచెవులతో నేను విన్నాను! కాట్ బిట్వీన్ ది డెవిల్ అండ్ డీప్ సీ!


**-సూర్యభగవతి**


నాకు షాపింగు మీద వున్న మక్కువవల్లో, మరెందువల్లో కానీ యీ మధ్యని షాపింగుల మీద, చీరల మీద తెగ కలలు వచ్చేస్తున్నాయి! ఆయనతో సినిమా హీరోయిన్స్‌లాగ షాపింగుకి వెళ్ళినట్టూ, అక్కడ ముద్దినుసు చీరలూ చూసినట్టూ, మా పతిదేవుడు ఆరేసి గంటలు నాతో షాపింగుకి తిరిగినట్టూ...ఇలా రంగు, రంగుల కలలు! ఈ మధ్యనయితే వొకరోజు తెల్లారగట్ల వచ్చిన కలయితే నేనెప్పటికీ మరిచి పోలేను. బెంగుళూరులో ఆయనతో ఐదు గంటలు శ్రమపడి షాపింగు చేసి నేనో చీర కొను క్కున్నానట! దాని అందం యెలా వర్ణించను? దాని అంచు మెజెంటా కలరు! చీర రంగు పసు పుపచ్చ! ఆ పసుపుపచ్చ మీద ఆకుపచ్చ పువ్వులు!!! ఓహ్! అద్భుతమైన చీర!! ఎంత చక్కగా వుందో! మెటీరియల్ కలలో సరిగా తెలియలేదు కాని, దాని అందం చూస్తే అది ఖచ్చితంగా మైసూరు సిల్కు చీర అయి



వుండాలి. మిగతా వాటికి ఆ 'గ్రేస్' రాదు. అది కొనుక్కున్నానా? మర్నాడు అది కట్టుకొని, మా ఆయనతో సహా సంక్రాంతి సినిమాలో హీరో, హీరోయిన్ వెళ్ళిన టర్కీలో కప్ప డోక్యాలో ఫెయిరీ చిమ్నీస్ లొకేషన్‌కి వెళ్ళేమట! మర్నాడు తెలివొచ్చేక వొకర కమైన అనుభూతి! ఒక ప్లెజెంట్ ఫీలింగ్!! మూడు రోజులాలోచించి చివరికి దాచుకోలేక ఆయనతో చెప్పేశాను నాకు వచ్చిన కల మొత్తం. ''అయ్యో పిచ్చిదానా! నీకు కావల సింది మెజెంటా అంచున్న పసుపుపచ్చ మీద ఆకుపచ్చ పువ్వులున్న మైసూరు సిల్కు చీరే కదా? నో ప్రోబ్లెం. ఎప్పుడు వెళ్దామో ప్లాన్ చెయ్యి. మార్కెట్‌కి వెళ్దాం'' అన్నారాయన. ఏ మాటకామాట చెప్పుకోవాలి..మా ఆయన చాలా మంచివారు! అయితే షాపుకెళ్ళిన దగ్గర నుండి కొనేసుకోమని నసపెట్టకూడదనే షర తుకి ఆయనని వొప్పించడానికి మరో రెండు రోజులు పట్టింది. ఆయన యింటికొచ్చేసరికి జీడిపప్పు పకోడీలు చేసి, తినిపించి, ముస్తా బయి పిల్లలతో సహా షాపింగుకి బయల్దేరాం. జగదాంబా జంక్షన్ నుండి, పాత పోస్టాఫీసు దాకా యెక్కే గుమ్మం, దిగే గుమ్మంగా ప్రతి బట్టల షాపూ చూశాం. నా కలల చీర యెక్కడా దొరకలేదు! పాపం ఆయన నాకిచ్చిన మాట ప్రకారం కిక్కురుమనలేదు. ఇంటికొ చ్చేసరికి రాత్రి పదకొండయింది. నాకే కళ్ళంట నీళ్ళొచ్చినంత పనయ్యింది. ఆయనమటుకు ''సర్లేవోయ్. ఈసారి మద్రాసు వెళ్ళినప్పుడు చూద్దాం. అక్కడయితే ప్రపంచంలో నేసిన ప్రతిచీరా కనీసం వొక్కటయినా వుండి తీరు తుందట. నీక్కావలసిన చీర తప్పక దొరుకు తుంది'' అన్నారు.

ముందు తరాల వాళ్ళ త్యాగాల వల్లో, మన ఆర్థిక వ్యవస్థ చక్కబడిపోవడం వల్లో నాకు తెలీదు కాని యీమధ్య యెవరు మా యింటికి వచ్చినా ''మీరు పెద్దవాళ్ళు, పార్వతీ, పరమేశ్వరుల్లా వున్నారు. అందు వల్ల యిస్తున్నాం'' అని నాకో చీర, జాకెట్టు పీసూ, ఆయనకో లుంగీవో, తువ్వాలో యిచ్చేస్తున్నారు! పార్వతీ,




పరమేశ్వరులన్నాక కాదనలేం కదా! వాళ్ళువాళ్ళకి ఆయన తొలి సంతానం. మావాళ్ళకి నేను తొలిసంతానం అవడం వల్లననుకుంటా యీపార్వతీ, పరమేశ్వరులన్న బిరుదు మాకు!

అలాగే మేం యెవరింటికెళ్ళినా యిదే తంతు. ''మీరేం రోజూ వచ్చేస్తారా? ఏదో మా శక్తికొద్దీ పెట్టుకొంటాం. మీరు కాదనకూడదు'' అని మా నోళ్ళు నొక్కేస్తారు! మేం ఆస్ట్రేలియాలో వున్న నాలుగేళ్ళూ అయితే మరీనూ. ప్రతి యేడూ వచ్చేవాళ్ళం. ''మీరయితే యేవో తెస్తుంటారు. మీకివ్వటానికి బట్టలు తప్ప మాకేం తోచవు. కాదనకండి'' అని చీర యిచ్చేసేవారు! యీతావాతా నా దగ్గర యెన్ని కొత్త చీరలు పేరుకుపోయాయో! ఆడపుటక పుట్టాక, అన్ని చీరలు బీరువాలో మూలుగుతుంటే మళ్ళా కొనేసుకోడానికి మన సొప్పదు కదా! అలా యిచ్చి నన్నేదో కష్టపెట్టేస్తున్నారని నా వుద్దేశ్యం కాదు. కానీ రోజు, రోజుకీ యీ సమస్య నాకు విపరీతమైన తలనొప్పిగా తయారయింది. సరిగా నిద్ర పట్టడం కూడా మానేసింది!

ఎట్టకేలకు నేను యెదురు చూసిన మద్రాసు వెళ్ళే అవకాశం వచ్చింది. ఆయనకి అక్కడ యేదో ఆఫీసు పని తగలటంతో, పిల్లలని తాతగారింటికి పంపించి, నేనూ బయల్దేరాను ఆయనతో..నా 'వన్ పోయింట్ ప్రోగ్రాం' తో సహా. ఆయన ఆఫీసు పని మీద వచ్చేం కదా! మరి తొందర పెడితే ఆయనకి కోపం వస్తుందని యెప్పుడు పిలుస్తారా షాపింగుకి అని చకోరపక్షిలా యెదురు చూస్తూ కాలక్షేపం చేస్తున్నాను. ఆఖరికి వెళ్ళి పోవలసిన రోజు వచ్చేసింది. ఆయన పని ముగించుకొని మూడు గంటలకల్లా మేం బస చేసిన హోటలికి వచ్చేసేరు.

అయితే వస్తూనే ''భగవతీ! యీయన కాళిదాసు గారు. మా నాన్నగారికి మంచిమిత్రులు. ఈవిడ రాజేశ్వరమ్మగారు. పార్వతీ, పరమేశ్వరుల్లా లేరూ? నమస్కారం చేసి ఆశీస్సులు తీసుకో'' అన్నారు. మనస్సులోనే నాకు నవ్వు వచ్చింది. 'మా పార్వతీ, పరమేశ్వరుల రోల్ వీళ్ళకి టెంపరరీగా బదిలీ చేయవచ్చన్నమాట' అనుకొన్నాను.

కాఫీలు తాగుతున్నప్పుడు ఆయన మా షాపింగు విషయం చెప్పారు. 'అమ్మయ్యా! అయితే యీయన మరిచిపోలేదన్నమాట' అనుకొన్నాను నేను. ''దానికేం భాగ్యం. యిక్కడ నల్లీస అని వొక మంచి షాపు వుంది. అక్కడ బ్రహ్మాండమయిన రేంజి దొరుకుతాయి. అక్కడకెళ్దాం'' అన్నారు కాళిదాసు గారు. అందరం కాళిదాసుగారి కారుల్లోనే నల్లీస్‌కి వెళ్ళేం. ''నాకిదే చికాకు. ఈ నల్లీస్‌లో దొరికితే సరే. దొరక్కపోతే? టైమే లేదు మరెక్కడా చూడడానికి''

సరే! నల్లీస్‌లో వెతకగా, వెతకగా చివరికి నా మెజెంటా అంచున్న పసుపుపచ్చ మీద ఆకుపచ్చ పువ్వులున్న మైసూరు సిల్కు చీర దొరకలేదు కాని, వొక చీర మా పతిదేవుడు యెంచేరు. ఆరెంజి అంచు, మెజెంటా రంగు చీరమీద ఆకుపచ్చ పువ్వులు. ''నీ రంగులన్నీ వున్నాయి కదా. ఒక్క పసుపుపచ్చకి బదులుగా ఆరెంజి వుంది. చీర బాగులేదూ! ఏం భగవతీ? యేమంటావు? కొనేసుకో కూడదూ? మనకి టైము కూడా కావస్తోంది కదా?'' అని శ్రీవారి ముక్తాయింపు! ఆయన ముఖంలో విసుగు అప్పుడే తొంగిచూస్తూ నాకు దొరికిపోయింది. అయినా పరాయివాళ్ళ యెదురుగా యేం మాట్లాడను? నా ముఖంలో అసంతృప్తి గమనించాడు కాబోలు..సేల్స్‌మాన్ ''మేడం! సారీ! మీరడిగిన మెజెంటా అంచున్న పసుపుపచ్చ మీద ఆకుపచ్చ పువ్వులున్న మైసూరు సిల్కు చీర నిన్ననే యెవరో కొని పట్టుకుపోయారు. మీకు తెలుసు కదా! చీరలు వొక కలర్ కాంబినేషన్‌లో వొక్కటే తయారవుతుంది. అయితే వేరే మిల్లులో తయారవవచ్చును కోండి! ఈ చీర కూడా వొక్కటే వుంది. మీరు తీసుకొంటారా? లేక వేరే షాపులో ట్రై చేస్తారా?'' అన్నాడు.

నా మొహం! వేరే షాపులో ట్రై చేసే ప్రాప్తం నాకెక్కడిదీ? నో ఛాన్స్. ఈ జన్మకింతే! ఆయన.ముఖంలో విసుగు అప్పుడే తారాస్థాయికి చేరుతోంది. గెస్టుల ముందు బయటపడలేక కక్కలేక, మింగలేక అవస్థపడుతున్నారు. సరే కొనెయ్యమని ఆయనతో చెప్పేసేను. ఆయన మహ ఆనందపడిపోయి, బిల్లూ అది రాయించి కొంటరు వేపు నడిచారు. తీరా కొంటరు దగ్గరకి ఆయన వెనకగా నేను చేరేసరికి కాళిదాసుగారు ఆయనకి చీవాట్లేస్తున్నారు. ''ఏం వోయ్! నేను మీ నాన్నలాంటి వాడిని కాదా? మా వూరొచ్చి నీ భార్యకి నువ్వు చీర కొంటావా? అదీకాక మీ పెళ్ళికి కూడా మేం రావడం కుదరలేదు. రాలేకపోయామని యెంతో బాధపడ్డాం. నీ పెళ్ళయి పాతికేళ్ళయినా, పెళ్ళి తర్వాత మనం కలవడం యిదే ప్రథమం కదా? యేదీ..మీ నాన్నకి ఫోన్ చేసి మాట్లాడుతాను'' అంటూ ఆయన్ని చితక్కొట్టేస్తున్నారు కాళిదాసుగారు అదేదో పెళ్ళానికి మొగుడు చీరకొనడం క్షమించరాని నేరమన్నట్టు!

అలా కాళిదాసుగారుకొన్న చీరతో మావూరు తిరిగొచ్చేము. ఇప్పుడు నాకు ఖచ్చితంగా తెలుసు...యీ జన్మలో నేను నాకు నచ్చిన మెజెంటా అంచున్న పసుపుపచ్చ మీద ఆకుపచ్చ పువ్వులున్న మైసూరు సిల్కు చీర, నాకు నచ్చిన తీరులో కొనుక్కోడం అసాధ్యమని.

☆